క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక



బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చండూరు : మండలంలోని దోనిపాముల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో చేరినవారిలో దోనిపాముల కాంగ్రెస్ అధ్యక్షుడు మండల లింగస్వామి, మహమూద్, పర్సనబోయిన సైదులు, పులకరం లింగస్వామి ఉన్నారు. కార్యక్రమంలో చిలువేరు నరేష్, నాగార్జున, రామాచారి, పులకరం సీతయ్య, జగన్, నాగార్జున, కోటాచారి, మహేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

పీఆర్‌పీఎస్ అభ్యర్థులను గెలిపించాలి



మాట్లాడుతున్న నూనె వెంకటస్వామి

నకిరేకల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా పోరాట సమితి (పీఆర్‌పీఎస్) అభ్యర్థులను గెలిపించాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి కోరారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పీఆర్‌పీఎస్ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిస్వార్థంగా ప్రజల పక్షాన నిలిచే ప్రజాపోరాట సమితి అభ్యర్థులకు ప్రజలు అండగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో పాల్వాయి వెంకటేశ్వర్లు, దుర్గం కాంతయ్య, మేడి సైదులు, జిల్లా శేఖర్, యారా రామలింగయ్య, మర్రి భిక్షం, పాలడుగు రాములు, ఎకాలి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న లక్ష్మీనారాయణ

చండూరు : హైదరాబాద్‌లోని తుర్కయంజాల్‌లో అక్టోబర్ 14, 15 తేదీల్లో జరిగే మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. చండూరులో మంగళవారం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు.

పోలింగ్ బూత్‌లలో సౌకర్యాలు కల్పించండి




గ్రామ అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ యుగేంధర్‌రెడ్డి

మునుగోడు: స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎంపిక చేసిన పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ యుగేంధర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మునుగోడు మండలంలోని సింగారం, ఊకొండి, రత్తిపల్లి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి బూత్‌లో విద్యుత్ సౌకర్యం, మంచి నీరు, మరుగుదొడ్లు సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా దివ్యాంగులు బూత్‌లలోకి వెళ్లేందుకు వీలుగా ర్యాంపులు సిద్ధం చేయాలని సూచించారు. ఆయన వెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు, గ్రామ పరిపాలన అధికారులు ఉన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన

మునుగోడు: బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే వాటిని రాష్ట్ర గవర్నర్ ఆమోదించకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు మునుగోడు మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలను అన్యాయం చేయవద్దని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుంటోజు వెంకటచారి, ఆనగంటి కృష్ణ, కొండ వెంకన్న, తన్నీర్ నందివర్ధన్, బైరవోని భాను ప్రసాద్, కొమరెల్లి సాయి పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ప్రాథమిక ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయ్యేనా!

- పెరుగుతున్న రోగుల సంఖ్య
- సరిపడా లేని వైద్యులు, సిబ్బంది
- పెచ్చులూడుతున్న పైకప్పు

చిట్యాల: ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు లేకపోవడం, సరైన వసతులు లేకపోవడంతో పేదలకు మెరుగైన వైద్యం అందడం లేదు. చిట్యాల పట్టణ ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోని నిరుపేదలు వైద్యం కోసం పట్టణ శివారులోని ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రికి వెళుతుంటారు. కానీ ఆస్పత్రిలో రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్య సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసి మౌలిక వసతులు కల్పించడం, వైద్య సిబ్బందిని కేటాయించడంలో జాప్యం జరుగుతోంది.

కిటకిటలాడుతున్న ఆస్పత్రి..

చిట్యాల పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రికి కొనేళ్లుగా రోగుల సంఖ్య పెరుగుతోంది. ఇటీవల విషజ్వరాలు వ్యాప్తి చెందడంతో రోగుల సంఖ్య మరింత పెరిగింది. ప్రతిరోజూ సుమారు నూట ఇరవై మందికిపైగా రోగులు ఆస్పత్రికి వస్తుంటారు. అంతేకాకుండా ఈ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు లక్ష్యానికి మించి చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో నెలకు నలభై మందికిపైగా మహిళలకు కాన్పులు అవుతున్నాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో 6 బెడ్‌ల వరకు మాత్రమే రోగులకు సౌకర్యం ఉంది. ప్రస్తుతం ఆస్పత్రిలో ఫార్మసిస్ట్‌తోపాటు స్టాఫ్‌నర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



చిట్యాల ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి భవనం

30 ఏళ్ల క్రితం నిర్మాణం

చిట్యాల ఆస్పత్రిని 30 ఏళ్ల క్రితం నిర్మించారు. కాగా ఇటీవల ఆస్పత్రిలోని పేషెంట్ ఇన్ వార్డు రూంతోపాటు వైద్య పరీక్షలు నిర్వహించే గదిలో సైతం పైకప్పుతోపాటు గోడల పెచ్చులూడుతున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లకు ఆస్పత్రిలో సమావేశపు గది లేదు. దీంతో ఆస్పత్రి బయటి చెట్ల కింద ప్రస్తుతం సమావేశాలు నిర్వహిస్తున్నారు.

ఏరియా ఆస్పత్రిగా మారిస్తేనే..

అరవై ఐదో నంబర్ జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ ప్రమాదాల్లో అనేకమంది గాయాలపాలవుతుండగా, మరి కొంతమందికి సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతుంటారు. గతంలో జిల్లాల పునర్విభజనకు ముందు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలను పోస్టుమార్టం కోసం చిట్యాల నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలోని ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లేవారు. కానీ ప్రస్తుతం ఇరవై ఐదు కిమీ దూరంలో ఉన్న నల్లగొండకు తీసుకెళ్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చిట్యాల పీహెచ్‌సీని ఏరియా ఆస్పత్రి స్థాయికి అప్‌గ్రేడ్ చేసి తగిన వైద్య సిబ్బందిని కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆస్పత్రి వార్డులో పెచ్చులూడుతున్న పైకప్పు

ప్రతిపాదనలు అందజేశాం

చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రికి ఇటీవల రోగుల సంఖ్య పెరిగింది. అందుబాటులో ఉన్న వసతులతో, సిబ్బందితో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నాం. చిట్యాల పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసి 30 పడకల ఆస్పత్రిగా మార్చాలని ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం.

– డాక్టర్. వెంకటేశ్వర్లు, చిట్యాల పీహెచ్‌సీ

సీజేఐపై దాడి హేయమైన చర్య

నల్లగొండ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) గవాయ్‌పై దాడి హేయమైన చర్య అని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలో కేవీపీఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది దర్శనం నర్సింహ, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇందూరి సాగర్, చినపాక లక్ష్మీనారాయణ, గోలి సైదులు, కొండ అనురాధ, కొండ వెంకన్న, గాదె నరసింహ బొల్లు రవీందర్‌కుమార్, రేఖల సైదులు తదితరులు పాల్గొన్నారు.

సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడి.. భారత రాజ్యాంగంపై జరిగిన దాడి

నల్లగొండ టౌన్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడి.. భారత రాజ్యాంగంపై జరిగిన దాడి అని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ అన్నారు. నల్లగొండలోని ఎంఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నాయకులు పాల్గొన్నారు.



నల్లగొండ : నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తున్నాం

నల్లగొండ టౌన్ : భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండిస్తున్నట్లు మాదిగ జేఏసీ చైర్మన్ పెరిక కరణ్ జయరాజు, చొల్లేటి ప్రభాకర్ అన్నారు. నల్లగొండలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మాస్ జిల్లా అధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కత్తుల షణ్ముఖకుమార్, నజీరుద్దీన్, అభిమన్యు శ్రీనివాసు, కొండేటి వెంకట్, శివరామకృష్ణ, కత్తుల సన్నీ, విరిగి ప్రసాద్, మోత్కూరు శ్రీనివాస్, చింత లక్ష్మణ్, పుల్లెంల సందీప్, బకరం సైదులు, పినపరాళ్ల వెంకట్, పెరిక నారాయణ, కత్తుల హరి పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో సామగ్రి ధ్వంసం

గట్టుప్పల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోకి మంగళవారం సాయంత్రం ఓ వ్యక్తి ప్రవేశించి వస్తు సామగ్రిని ధ్వంసం చేశాడు. కార్యాలయ సిబ్బంది, ఎస్‌ఐ సంజీరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గట్టుప్పల్ ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బంది విధుల్లో ఉండగా సుమారు 4 గంటల ప్రాంతంలో గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన శ్రీశైలం అనే వ్యక్తి కార్యాలయంలోకి ప్రవేశించాడు. అతడి చేతిలో ఉన్న రాయితో రెండు కంప్యూటర్లను ధ్వంసం చేశాడు. అడ్డు వచ్చిన సిబ్బందిపై తిరగబడినట్లు ఎస్‌ఐ వివరించారు. మద్యం మత్తుతో ఈ పని చేశాడు, ఏదైనా ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఎంపీడీఓ వసంత లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. బాధ్యుడిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



నల్లగొండ టూటౌన్ : వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ, అధ్యాపకులు



నల్లగొండ టౌన్ : పూజలో పాల్గొన్న భక్తులు

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని ఎంజీ యూనివర్సిటీలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలువాల రవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కుమురం భీం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆకుల రవి, కొప్పుల అంజిరెడ్డి, శ్రీదేవి, అరుణప్రియ పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం నల్లగొండలోని వాల్మీకి ఆలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాంపాల్, ఓంపాల్, కుమార్, మురళి, సాహిత్య, విక్రం, పాండు, ఆదిత్య, లల్లు, కిరణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో మంగళవారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు ఎంపీడీఓ జి.చినమునయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నిర్మలాదేవి, ఆర్‌ఐ పాండురంగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం

గట్టుప్పల్ : జెడ్పీటీసీ స్థానంతోపాటు గట్టుప్పల్ మండలంలోని అన్ని ఎంపీటీసీలు, సర్పంచ్ స్థానాల్లో పోటీ చేసేందుకు సీపీఐఎం సిద్ధంగా ఉందని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం తెలిపారు. మంగళవారం గట్టుప్పల్ మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం పేద ప్రజల సమస్యలపై ఉద్యమించే సీపీఎంకు ఆదరణ ఉందన్నారు. ప్రజల వెంట ఉండే సీపీఎంను గెలిపించాలని కోరారు. గోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, చాపల మారయ్య, మండల కమిటీ సభ్యులు కర్నాటి సుధాకర్, అచ్చిని శ్రీనివాస్, నరసింహ, పర్సబోని యాదగిరి, ఖమ్మం రాములు, పెద్దగాని నరసింహ, కర్నాటి వెంకటేశం పాల్గొన్నారు.

గీత కార్మికులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

నకిరేకల్ : ప్రతి గీత కార్మికుడికి రెండు లక్షల రూపాయలు చొప్పున సబ్సిడీ రుణాలు అందించాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చౌగోని సీతారాములు ప్రభుత్వాన్ని కోరారు. నకిరేకల్‌లో మంగళవారం జరిగిన కల్లుగీత కార్మిక సంఘం నాలుగో మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 5 లక్షల మంది గీత కార్మిక కుటుంబాలు కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. సబ్సిడీ రుణాలు మంజూరు చేసి కల్లుగీత కార్మికులకు మేలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొప్పుల అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా గుడుగుంట్ల బుచ్చిరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం మండల అధ్యక్షుడు గుడుగుంట్ల బుచ్చిరాములు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పామనగుండ్ల అచ్చాలు, జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న, జిల్లా ప్రతినిధులు రాచకొండ వెంకట్‌గౌడ్, కొప్పుల అంజయ్య, ఎరుకల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చౌగోని సీతారాములు

ఆధునిక సాగుపై పత్తి రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న ఫౌండేషన్ ప్రతినిధులు

కట్టంగూర్ : ప్రపంచ పత్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని కట్టంగూర్ మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో మంగళవారం కోణం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పత్తి రైతులకు కృషి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు అంజయ్య, పరుశురామ్ మాట్లాడుతూ ప్రపంచంలో పత్తి ఉత్పత్తిలో భారతదేశం ప్రథమ స్థానంలో ఉందన్నారు. పత్తి ఆధారిత టెక్స్‌టైల్స్, జిన్నింగ్, ఫైబర్, పరిశ్రమల ద్వారా లక్షలాది మందికి ఉపాధి లభిస్తోందని తెలిపారు. కృషి కార్యక్రమం ద్వారా పత్తి రైతులకు అన్ని వేళలా సలహాలు, సూచనలు అందిస్తామని తెలిపారు. జిల్లాలో 30కిపై గ్రామాల్లో 2వేల మందికి అండగా నిలుస్తూ ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన విత్తనాల ఎంపిక, ఎరువులు, సరైన పురుగు మందుల వాడకం, రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక సవాళ్లు, పర్యావరణ పరిరక్షణ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎంను ఆదరించాలి



మాట్లాడుతున్న వీరారెడ్డి

కట్టంగూర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎంను ప్రజలు ఆదరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. మంగళవారం కట్టంగూర్ మండల కేంద్రంలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా సీపీఎం ముందుకు వెళుతోందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి వచ్చే పార్టీలతో పనిచేయడానికి జిల్లా కమిటీ నిర్ణయం తీసుకుందని తెలిపారు. జిల్లాలో 120 ఎంపీటీసీలు, 200 సర్పంచ్‌లు, 2వేల వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, చిలుముల రామస్వామి, గడగోజు రవీంద్రాచారి, జాల రమేష్, ఊట్కూరి శ్రీను, జాల ఆంజనేయులు, కక్కిరేణి రామస్వామి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న శ్రీనివాస్

నార్కట్‌పల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో నార్కట్‌పల్లి మండలంలోని అన్ని స్థానాలను బీజేపీ గెలుచుకోవడం ఖాయమని బీజేపీ మండల అధ్యక్షుడు మేడబోయిన శ్రీనివాస్ అన్నారు. మంగళ వారం నార్కట్‌పల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి విఫలమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ నడింపల్లి శ్రవణ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రూపని సత్యనారాయణ, ఓబీసీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు మునుకుంట్ల గణేష్, మండల ఉపాధ్యక్షుడు నోముల రాజు, మండల ప్రధాన కార్యదర్శులు బిళ్ళకంటి శ్రీకాంత్, ఎడమ పురుషోత్తంరెడ్డి, పాల్వాయి భాస్కర్‌రావ్, తోటకూరి శివ కుమార్, బిళ్ళకంటి గణేశ్, మేడి గణేశ్, వడ్డెగోని రామలింగం, నడింపల్లి పార్థసారథి, రావుల తిరుమలేష్, బొల్లెద్దు రామలింగం, కొత్త మహేష్, పాలకూరి రమేష్, అశోక్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిలువుటద్దం



గట్టుప్పల్ - ధర్మతండా మధ్యలో ప్రవహిస్తున్న వాగు (ఫైల్)

గట్టుప్పల్ : ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా అధికారుల అలసత్వంలో పనులు ముందుకు సాగలేదు. దీంతో పనులు చేయడానికి ప్రభుత్వం విధించిన గడువు పూర్తికావడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. గట్టుప్పల్ మండల కేంద్రం నుంచి ధర్మతండా మధ్యలో వాగుపై కల్వర్టు నిర్మాణానికి 2023వ సంవత్సరంలో ఫ్లడ్ డ్యామేజ్ కింద నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభానికి శిలాఫలకం సైతం వేశారు. కానీ సంబంధిత కంట్రాక్టర్‌తో అధికారులు పనులను చేయించలేకపోయారు. గడువు పూర్తి కావడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. చిన్నపాటి వర్షం వచ్చినా వాగు పొంగి పొర్లడంతో తండా వాసులు గూటికి చేరుకోలేక అవస్థలు పడుతున్నారు. భారీ వర్షం వస్తే రాకపోకలకు అంతరాయం తప్పడం లేదు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా మంగళవారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు అక్కెనపల్లి బీష్మాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ వేణుగోపాల స్వామి రుక్మిణి, సత్యభామ కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆలయంలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న వారికి తీర్థ ప్రసాదాలతోపాటు అన్న ప్రసాదాన్ని ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఏఎంసీ చైర్మన్ నర్రా వినోద మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బుర్రి రవీందర్‌రెడ్డి, మెడబోయిన లింగయ్య, మాజీ ఉప సర్పంచ్ సాగర్ల నరేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

నూతన కమిటీ ఎన్నిక

మర్రిగూడ : పంచాయతీ కార్యదర్శుల సంఘం మర్రిగూడ మండల అధ్యక్షుడిగా వట్టిపల్లి గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి గోన వంశీకృష్ణ ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ జి.చినమునయ్య, ఎంపీఓ రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా శివన్నగూడకు చెందిన లింగం లక్ష్మీ, ఉపాధ్యక్షుడిగా యరగండ్లపల్లికి చెందిన ఇరిగి శ్రవణ్, జనరల్ సెక్రటరీగా ప్రసన్నబాబు, ట్రెజరర్‌గా పెరుమాళ్ల మౌనికలు ఎన్నికయ్యారు.

నిందితులను శిక్షించాలి

నల్లగొండ టౌన్: ప్రేమ పేరుతో విద్యార్థినిని మోసం చేసి అత్యాచారం, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ బాలికల రాష్ట్ర కోకన్వీనర్ కుంచం కావ్య, జిల్లా సహాయ కార్యదర్శి స్పందన ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థినులపై, మహిళలపై అత్యాచారాలు చేసి హత్యలు చేయడం దుర్మార్గం అన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

నకిరేకల్ : పట్టణంలోని ఏవీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎస్.తేజశ్రీ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. గత నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలంలో నిర్వహించిన 35వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో నల్లగొండ జిల్లా జట్టు తరఫున తేజశ్రీ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాను ద్వితీయ స్థానంలో నిలిపింది. మంగళవారం తేజశ్రీని పాఠశాలలో ఉపాధ్యాయులు సత్కరించారు. తేజశ్రీని డీఈఓ భిక్షపతి, ఎంఈఓ మేక నాగయ్య అభినందించారని పాఠశాల ప్రిన్సిపాల్ కందాల స్వప్నాశ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆమెను కబడ్డీలో తీర్చిదిద్దిన పాఠశాల పీడీ నిమ్మల శంకర్‌గౌడ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి, పూర్ణచందన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



తేజశ్రీని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

పౌష్టికాహారంపై అవగాహన

నకిరేకల్ : నోముల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ అధికారులు మంగళవారం పౌష్టికాహారంపై చిన్నారుల తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను ఉయ్యాలలో వేసే కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి అస్రా అంజుమ్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలతో కూడి ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు భవాని, సునీత, అంగన్‌వాడీ టీచర్ ఖైరున్నీసా, ఆయా సరిత పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం

కట్టంగూర్ : నిత్య వ్యాయామంతోపాటు ప్రాణయామం, ధ్యానంతో మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని కట్టంగూర్ ఎస్‌ఐ మునుగోటి రవీందర్ అన్నారు. మంగళవారం కట్టంగూర్ మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూర్ కింగ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్ ఆన్ స్ట్రెస్ ఫ్రీ వర్కింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పనులను ప్రణాళికాబద్ధంగా చేయడంతో పని ఒత్తిడిని తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రతిఒక్కరికి సమయానికి ఆహారం, సరిపడా విశ్రాంతి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నాయిని శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు రెడ్డిపల్లి సాగర్, కల్లూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గుడిపాటి శివప్రసాద్, కోశాధికారి పి.రాములు, సభ్యులు మంగదుడ్ల శ్రీనివాస్, రాపోలు వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి వెంకన్న, పోలీసు సిబ్బంది మునాస సత్యనారాయణ, అనూష, శ్రీరాములు, అక్బర్‌అలీ, రాంమోహన్, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ రవీందర్

అపరిశుభ్రంగా ఆస్పత్రి ఆవరణ

మునుగోడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణ అంతా అపరిశుభ్రంగా మారించి. ఆస్పత్రి చుట్టూ ఉన్న ఖాళీ స్థలం, శిథిలమైన గదులు, పిచ్చి మొక్కలు, మట్టి దిబ్బలతో నిండి ఉంది. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పిచ్చి మొక్కలతో నిండిన మునుగోడు పీహెచ్‌సీ ఆవరణ



ఆస్పత్రి ఆవరణలో నిలిచిన వర్షపు నీరు